# ప్రశ్నలెలా బయటకొచ్చాయి?

- తెల్ల కాగితంపై కనిపించిన గణిత ప్రశ్నలు
- విచారణ చేపట్టిన సబ్ కలెక్టర్, డీఈవో
- ముగ్గురిపై సస్పెన్షన్‌పై వేటు వేసిన అధికారులు
- టెన్త్ పరీక్షల నిర్వహణపై తలెత్తుతున్న సందేహాలు!

**జుక్కల్‌లోని టెన్త్ పరీక్షా కేంద్రంలో ఘటన**



అధికారులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు

కామారెడ్డి/బిచ్కుంద, మార్చి 26: జుక్కల్ మండల కేంద్రంలోని టెన్త్ ఎగ్జామ్ సెంటర్ ఆవరణలో తెల్ల కాగితంపై రాసి ఉన్న ప్రశ్నలు కనిపించిన ఉదంతం బుధవారం జిల్లాలో కలకలం రేపింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. బుధవారం గణిత పరీక్ష నిర్వహించగా, విద్యార్థులకు ఇచ్చిన పేపర్‌లోని నాలుగు ప్రశ్నలు రాసి ఉన్న కాగితం కేంద్రం బయట కనిపించినట్లు ప్రచారం జరిగింది. ఈ వ్యవహారంపై కొంత మంది ఫిర్యాదు చేయడంతో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు పరీక్షా కేంద్రానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రస్తుతానికి చీఫ్ సూపరింటెండెంట్ సునీల్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ భీమ్, ఇన్విజిలేటర్ దీపికను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

**విభిన్న కోణాల్లో విచారణ..**

ప్రశ్నలు ఎప్పుడు బయటికి వచ్చాయి? పరీక్ష జరుగుతున్న సమయంలోనే బయటకు వచ్చాయా? లేక అయిపోయిన తర్వాతనా అన్న దానిపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. ఎగ్జామ్ సెంటర్‌లో పని చేసే వారే ప్రశ్నలను బయటకు పంపించారా? ఇందులో ఎవరెవరి ప్రమేయముంది? తదితర అంశాలపై విచారిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు, ఈ ఉదంతంపై డీఈవో రాజు జుక్కల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరోవైపు, పేపర్ లీకేజ్ కాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రశ్నలు బయటికి ఎలా వచ్చాయన్న దానిపై ఎవరూ నోరు మెదపడం లేదు. ఈ అంశాన్ని పోలీసులే తేలుస్తారని చెబుతున్నారు. ఎక్కడా సమస్యలు లేకుండా పరీక్షలు జరుగుతున్నాయని, ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, విద్యార్థులెవరూ భయపడకుండా పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు.

**విచారణ జరుగుతోంది..**

జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఏం జరిగిందనేది విచారణ తర్వాతే వెల్లడిస్తామని డీఈవో రాజు చెప్పారు. జుక్కల్ ఉదంతంపై ఆయనను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో సంప్రదించగా పై విధంగా తెలిపారు. ప్రశ్నల గురించి సోషల్ మీడియాలో పోస్టులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రానికి వెళ్లి విచారణ చేపట్టామన్నారు. ప్రశ్నాపత్రంలోని కొన్ని ప్రశ్నలు ఒక పేపర్ మీద రాసినట్లు గుర్తించామని చెప్పారు. అయితే, ఇది పరీక్షకు ముందు జరిగిందా.. లేక పరీక్ష అయిపోయిన తర్వాత జరిగిందా? అన్న కోణంలో విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తయ్యాకే అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రస్తుతానికి ముగ్గురిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.




# తాగునీటి కోసం భగీరథ ప్రయత్నం

**రెండు నెలలుగా శుద్ధ జలాల సరఫరా బంద్**

- కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు
- తొర్తి గ్రామంలో దాహం.. దాహం

ఏర్గట్ల, మార్చి 26: తాగునీటి కోసం ఆ గ్రామస్తులు భగీరథ ప్రయత్నం చేయక తప్పడం లేదు. రెండు నెలలుగా గ్రామానికి శుద్ధ జలాలు సరఫరా కావడం లేదు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా .. పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీస అవసరాలు తీర్చుకోవడానికి కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. ఇవి ఏర్గట్ల మండలంలోని తొర్తి గ్రామస్తుల నీటి కష్టాలు. తొర్తి గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నది. గ్రామంలో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు నుంచి వేంకటేశ్వర గుడి వెనుకాల ఉన్న కొత్త ప్లాట్ కాలనీకి నిత్యం నీరు సరఫరా చేస్తారు. ఈ కాలనీలో సుమారు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కానీ రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉన్నదని, డబ్బులు పెట్టి నీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి దాపురించిందని అంటున్నారు. వేసవి ఆరంభంలో ఇలా ఉంటే.. మొత్తం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.

**ఫిల్టర్ నీళ్లు కొనుక్కుంటున్నం..**



రెండు నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలెం గ్రామం నుంచి ఫిల్టర్ నీళ్లు కొనుక్కొని, తెచ్చి తాగుతున్నం. అధికారులు స్పందించి మా నీటి గోస తీర్చాలె.

-తోకల ఈశ్వర్, తొర్తి

**మినీ వాటర్ ట్యాంకు నుంచి తెచ్చుకుంటున్నం..**



నల్లా నీళ్లు వస్తలేవు. కనీస అవసరాల కోసం మినీ వాటర్ ట్యాంకు నుంచి బకెట్, బిందెలతో తెచ్చుకుంటున్నం. ఎండలు ఎక్కువైతున్నయ్. నీళ్లు లేకుంటే ఎట్లనో..? ఏమో..?

-కచ్చకాయల గంగామణి, తొర్తి

**మా గోసను అర్థం చేసుకోండి..**




మిషన్ భగీరథ నీళ్లు రాక డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. మా గోసను అర్థం చేసుకొని నీళ్లు వచ్చేలా చూడాలి.

-పుత్తీ బేగం, తొర్తి

# అమాత్యుడెవరో?

**త్వరలోనే మంత్రివర్గ విస్తరణ**

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల మధ్య తీవ్ర పోటీ
- మొదటిసారి ఎమ్మెల్యేల పేర్లు సైతం పరిశీలనలో..
- సీనియారిటీ వైపు మొగ్గుచూపుతారా?
- కొత్తవారికి అవకాశం ఇస్తారా?
- ఏఐసీసీ నిర్ణయంపై ఆశావహుల్లో ఎడతెగని ఉత్కంఠ
- ఢిల్లీలో కొందరు శాసనసభ్యుల పైరవీలు




నిజామాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నారనే వార్తల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెంది న కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. అమాత్య యోగం లభించేదెవరికి అన్నది చర్చనీయాంశమైంది. సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటారా? విధేయతకు పట్టం పడతారా? అన్న దానిపై అధికార పార్టీలోనూ ఆసక్తికర చర్చ జరుగుతున్నది. ఇటీవల ఢిల్లీ కేంద్రంగా జరిగిన సమావేశాలు, జోరుగా సాగుతున్న పైరవీలు.. వెరసి త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగనుందనే భావన విస్తృతంగా నెలకొన్నది. ఈ నేపథ్యంలో నిజామాబాద్, కామారెడ్డి (ఉమ్మడి జిల్లా)కి చెందిన వారిలో ఒకరికి బెర్త్ ఖాయంగా కనిపిస్తున్నది. రెండు జిల్లాల్లో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఎవరికి చాన్స్ దక్కుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**టెన్షన్.. టెన్షన్**

కాంగ్రెస్ గద్దెనెక్కాక మంత్రిమండలిలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత దక్కలేదు. ఎన్నికల్లో ఓడిపోయిన షబ్బీర్ అలీకి కేబినెట్ ర్యాంక్ కలిగిన ప్రభుత్వ సలహాదారు, నలుగురికి వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవులు మినహాయిస్తే పెద్దగా ప్రాతినిధ్యం లభించలేదు. ఈ నేపథ్యంలోనే త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణపైనే అందరి దృష్టి నెలకొంది. మరోవైపు, ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ వారితో పాటు పార్టీ సీనియర్లు ఒకరిద్దరు సైతం కేబినెట్‌లో అవకాశం కల్పించాలని అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. సీనియర్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి పోటీలో ముందుండగా, మిగిలిన ముగ్గురు కొత్త ఎమ్మెల్యేలు సైతం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏప్రిల్ మొదటి వారంలో ప్రమాణ స్వీకారం ఉంటుందని జోరుగా ప్రచారం సాగుతున్న వేళ మరోసారి కాంగ్రెస్‌లో రాజకీయం వేడెక్కింది. పార్టీలో చివరి క్షణం వరకూ ఏమైనా జరగొచ్చు అనే ప్రచారం ఉన్న నేపథ్యంలో పేరు ఖరారయ్యే వరకు ఆశావహులకు టెన్షన్ తప్పేలా లేదు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తనకే మంత్రి పదవి వస్తుందని సుదర్శన్‌రెడ్డి హంగూ ఆర్భాటాలు ప్రదర్శించారు. కానీ నెలల తరబడి నిరీక్షించాల్సి రావడంతో చివరకు వెనక్కు తగ్గారు.

**లోక్‌సభ ఓట్లే గీటురాయి**

మంత్రి పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ పాటించే ప్రామాణికతలు ఏమిటనేది కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది. సీనియారిటీ కోటాలో బోధన్ ఎమ్మెల్యే ముందున్నారు. కాకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడం సుదర్శన్‌రెడ్డికి మైనస్‌గా మారింది. జహీరాబాద్‌లో కాంగ్రెస్ గెలవడం వల్ల కామారెడ్డి జిల్లాలో కొత్త ఎమ్మెల్యేలకు సానుకూలంగా మారే అవకాశముందన్న ప్రచారం జరుగుతున్నది. నిజామాబాద్ నుంచి పలు పదవులను ఆశించిన వారికి ఎంపీ ఎన్నికలే వారి పాలిట గుదిబండగా మారాయని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లే పదవులకు గీటురాయి అన్న ప్రచారంతో మంత్రి పదవితో పాటు ఇతర కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు ఆశిస్తున్న వారిలో టెన్షన్ మొదలైంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓట్లు వచ్చి, ఎంపీ ఎన్నికల్లో తగ్గడానికి పార్టీ నేతల వైఫల్యమేనని ఏఐసీసీ నాయకత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. అధికారంలో ఉండి కూడా ఎంపీ ఎన్నికల్లో గౌరవప్రదమైన ఓట్లను, సీట్లను దక్కించుకోకపోవడం, గెలుస్తామనుకున్న సీటును బీజేపీ కైవసం చేసుకోవడంపైనా అగ్ర నాయకత్వం గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

**జోరుగా ఊహాగానాలు..**

సుదీర్ఘ కాలంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టక పోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నెలకొంది. మంత్రి పదవి కోసం పైరవీలు చేస్తూ ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ పెద్దలను కలిసి వచ్చేందుకే సమయాన్ని వృథా చేస్తున్నారు తప్పితే నియోజకవర్గాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడంలేదు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో సుదర్శన్‌రెడ్డికి ఇవే చివరి ఎన్నికలు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం కష్టమే. దశాబ్దాలుగా పార్టీకి విధేయుడిగా ఉండడంతో పాటు రేవంత్‌రెడ్డి బంధువు కావడం కూడా ఆయనకు కలిసొచ్చే అంశం. సామాజిక సమీకరణలో భాగంగా రెడ్డి సామాజిక వర్గానికి నల్లగొండ నుంచి ప్రాతినిధ్యం దక్కితే బోధన్ ఎమ్మెల్యేకు అవకాశం కష్టమేనని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల పేర్లు తెర మీదికి రావొచ్చని పేర్కొంటున్నారు. ప్రభుత్వ సలహాదారు పదవితో అంతగా సంతృప్తి చెందని షబ్బీర్ అలీ సైతం మైనార్టీ కోటాలో తనకే చాన్స్ ఇవ్వాలని శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. తీవ్ర పోటీ నెలకొన్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం ఎవరికి చాన్స్ ఇస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

# రాంనగర్‌లో బోరు డ్రిల్లింగ్

**తీరనున్న తాగునీటి కష్టాలు**




రాంనగర్‌లో బోరు వేయిస్తున్న అధికారులు

సారంగాపూర్, మార్చి 26: నిజామాబాద్ రూరల్ మండలంలోని రాంనగర్‌లో నీటి కష్టాలపై నమస్తే తెలంగాణ దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గ్రామంలో బుధవారం బోరు వేయించారు. పుష్కలంగా నీరు పడడంతో తమ కష్టాలు తీరినట్లేనని గ్రామస్తులు సంబురం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి బోరు, పైప్‌లైన్ కోసం గతంలోనే నిధులు మంజూరు చేశారు. సంబంధిత అధికారులు, నాయకులు పట్టించుకోక కాలయాపన చేస్తున్నారనే విషయాన్ని నమస్తే తెలంగాణ దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. దీంతో ఎంపీవో ఇక్బాల్, మిషన్ భగీరథ ఏఈ దామోదర్‌రావు, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ బుధవారం ఉదయమే గ్రామానికి చేరుకున్నారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలతో మాట్లాడారు. వెంటనే బోరు బండిని తెప్పించి బోరు వేయించారు. రెండు ఫీట్ల నీరు పడిందని నాయకుడు షేక్ జిలానీ తెలిపారు. రెండు రోజుల్లో పైప్‌లైన్ వేసి నీటిని సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎన్‌కౌంటర్ చేస్తారా.. చేస్కోండి

- చెప్పిన టైమ్‌కు వచ్చా.. ఏం చేస్తారు?
- పోలీసులకు సవాల్ విసిరిన యువకుడు
- హత్యాయత్నం కేసులో నిందితుడు
- నిజామాబాద్ జిల్లా కేంద్రంలో హల్‌చల్ చేసిన వైనం



వినాయక్‌నగర్, మార్చి 26: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ యువకుడు బుధవారం హల్‌చల్ చేశాడు. హత్యాయత్నం కేసులో జైలుకెళ్లి ఇటీవలే బెయిల్‌పై బయటికి వచ్చిన సదరు వ్యక్తి పోలీసులకే సవాల్ విసిరాడు. అసలేం జరిగిందంటే.. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్తపై దాడికి పాల్పడిన నిందితుడు ఇటీవలే కండీషన్ బెయిల్‌పై బయటకు వచ్చాడు. అతడు మంగళవారం రాత్రి సెల్ఫీ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. రేపు(బుధవారం) మధ్యాహ్నం నెహ్రూ పార్కుకు వస్తానని, ఏం చేస్తారు? ఎన్‌కౌంటర్ చేస్తారా.. అలాగే చేయండని ఐదో టౌన్ ఎస్సైకి సవాల్ విసిరాడు. వీడియోలో చెప్పినట్లే బుధవారం మధ్యాహ్నం నెహ్రూ పార్కుకు వచ్చిన సదరు యువకుడు నడిరోడ్డుపై నిల్చుని మరో సెల్ఫీ వీడియో తీశాడు. 'నేను వస్తా అన్నాను కదా. వచ్చా. ఐదో టౌన్ ఎస్సై ఇక్కడికి వచ్చి నన్ను ఎన్‌కౌంటర్ చేయాలని' ఛాతి కొట్టుకుంటూ సవాల్ చేశాడు. రోడ్డుపై వెళ్తున్న వారు ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

**నిందితుడిపై కేసు నమోదు..**

ఐదో టౌన్ ఎస్సైపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన రౌడీషీటర్ షేక్ రసూల్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. భూ తగాదా విషయంలో మాజీ ప్రజాప్రతినిధి భర్తపై దాడి చేసిన కేసులో అతడ్ని అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు తెలిపారు. పాత నేరస్తులకు తరచూ ఇచ్చే కౌన్సెలింగ్‌లో భాగంగా రౌడీషీటర్ రసూల్‌ను కూడా ఠాణాకు పిలిచి సత్ప్రవర్తనతో మెలగాలని చెప్పినట్లు తెలిపారు. కానీ నిందితుడు పోలీసులు వేధిస్తున్నారని సోషల్ మీడియాలో వీడియో పెట్టడం, ఎన్‌కౌంటర్ చేయండని పోలీసులకు సవాల్ విసరడం వంటివి చేశాడన్నారు. కండీషన్ బెయిల్‌పై వచ్చిన నిందితుడు షరతులు ఉల్లంఘించినందున బెయిల్ రద్దు చేయాలని కోర్టుకు లేఖ రాసినట్లు తెలిపారు. అలాగే, బైండోవర్ చేసిన రూ.5 లక్షలను జప్తు చేయాలని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు విన్నవించనున్నట్లు ఏసీపీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్**




బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో బుధవారం ఇఫ్తార్ ఏర్పాటుచేశారు. ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ హాజరై ముస్లిములకు పండ్లు తినిపించారు. ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సాంబార్ మోహన్, శక్కరికొండ కృష్ణ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

-ఇందల్వాయి (డిచ్‌పల్లి), మార్చి 26

# మార్కెట్ యార్డుకు వరుస సెలవులు

కంఠేశ్వర్, మార్చి 26: నిజామాబాద్ మార్కెట్ యార్డుకు వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 ఆర్థిక సంవత్సరం ముగింపు, 29న అమావాస్య, 30న ఉగాది, 31న రంజాన్, ఏప్రిల్ ఒకటిన రంజాన్ తదుపతి రోజు సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, తమ ఉత్పత్తులను ఏప్రిల్ రెండో తేదీ నుంచి మార్కెట్ యార్డుకు తీసుకు రావాలని సూచించారు.

# సమన్విత దవాఖాన సీజ్




సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

కామారెడ్డి, మార్చి 26: కామారెడ్డి పట్టణంలోని సమన్విత దవాఖానను సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. దవాఖానలో లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భ విచ్ఛిత్తి ప్రక్రియలు నిర్వహిస్తున్నారని పలుమార్లు ఫిర్యాదు అందాయన్నారు. పలుమార్లు నోటీసులు జారీచేసినా.. పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో పీసీపీఎన్‌డీటీ చట్టం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి, దవాఖానను సీజ్ చేసినట్లు చెప్పారు. గతంలో ఇదే దవాఖాన యాజమాన్యం కౌసల్య దవాఖాన పేరుతో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయగా.. డెకాయ్ ఆపరేషన్ చేపట్టి దవాఖానను సీజ్ చేసినట్లు తెలిపారు.

# కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్


కామారెడ్డి, మార్చి 26 : వ్యక్తితో దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్, హోంగార్డుపై సస్పెన్షన్ వేటు విధించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బాన్సువాడలోని ఓ కల్లు దుకాణంలో గొల్ల శ్రీనివాస్ తండ్రి దుర్గయ్య కల్లు తాగి న్యూసెన్స్ చేస్తున్నాడని స్థానిక పోలీస్ స్టేషన్‌కు బుధవారం సమాచారం అందింది. బ్లూకోర్ట్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కిరణ్, హోంగార్డు గంగాధర్ అక్కడికి వెళ్లి.. శ్రీనివాస్‌తో దురుసుగా ప్రవర్తించారు. దీంతో వారిని సస్పెండ్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

# అడవి మామిడిపల్లి రైల్వే గేటు వద్ద మరమ్మతులు

**ఒకరోజు వాహనాల రాకపోకలు బంద్**

మాక్లూర్, మార్చి 26: మండలంలోని అడవిమామిడిపల్లి రైల్వే గేటు వద్ద మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి తొమ్మిది నుంచి గురువారం రాత్రి ఆరు గంటల వరకు ఒక రోజు వాహనాల రాకపోకలు నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ వీల్ వాహనాలు ఈ మార్గంలో వెళ్లొద్దని, కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి మాత్రమే అనుమతి ఉన్నదని పేర్కొన్నారు. ఫోర్‌వీల్ వాహనాలు డిచ్‌పల్లి నుంచి ఆర్మూర్, చిన్నాపూర్ నుంచి ఆర్మూర్ మీదుగా వెళ్లాలని తెలిపారు. వాహనదారులు గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు.

**'స్త్రీనిధి'లో నిజామాబాద్ జిల్లా బెస్ట్**




'స్త్రీనిధి'లో 2023-24 సంవత్సరానికి గాను నిజామాబాద్ జిల్లాకు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్.. మంత్రి సీతక్క, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎంపీ శ్రీవిద్యాసాగర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కాగా ఆర్మూర్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ మండల సమాఖ్య అవార్డును అందుకున్నది.

– కంఠేశ్వర్, మార్చి 26